# ఎవరికి ఎవరు?

— తరిగొప్పుల నరసింహారావు

ఎక్కడ చూచినా వేదనలు రోదనలు వినబడుతున్నాయి. నర్సులు అటు ఇటు ఎవరో వెనుకనుండి వెంబడిస్తున్నట్లు తిరుగుతున్నారు. డాక్టర్లు కోటు జేబుల్లో చేతులు దూర్చి ఆపరేషన్ థియేటర్ వైపు వెళుతున్నారు. ఏదో హడావిడిగా ఉంది

నానోరు తడి ఆరిపోతున్నది. చేతులూ కాళ్ళూ ఆడటం లేదు. ఎలా ఉందో? ఏమౌతుందో?

"సిస్టర్! సిస్టర్!" కంగారుగా పిలిచేను.

చిరునవ్వుతో "ఏమి ఫరవాలేదండి. మీ ఆవిడ సుఖంగా ప్రసవిస్తుంది. మీరేమి భయపడకండి" అంటూ ధైర్యం చెప్పి వెళ్ళిపోయింది, సిస్టర్.

"అమ్మా.... అబ్బా.... నన్ను చంపేయండి. నేను ఈ బాధ భరించలేను." అంటూ ఆక్రోశిస్తోందామె.

అవును. ఆ గొంతు నా రాధదే, ఎంత విపరీతం! భగవంతుడు అసలు ఈ సృష్టి ఎందుకు పెట్టాడో! ప్రసవ వేదనతో స్త్రీకి ఎంత బాధ. స్త్రీ మాతృత్వం కోసం ప్రసవ వేదన స్వీకరించక తప్పదు.

మళ్ళీ అదే ఆక్రందన.

నామనస్సు అంతా జాలితో నిండిపోయింది. జాలికాదు అదినేనేమీ చేయలేని నిస్సహాయస్థితి.

లోపలినుంచి సిస్టర్ వచ్చింది. "మిమ్మల్ని ఒక్కసారి డాక్టర్ పిలుస్తున్నారు"

డోర్ తెరుచుకొని డాక్టర్ గదిలో ప్రవేశించాను. జంకుతూ, ఏంవినాల్సివస్తుందోనని.

"కూర్చోండి మిస్టర్ రావు డోన్ట్ ఫియర్. మీభార్యకిది మొదటి కాన్పు అందుకని చాలా కష్టంగా వుంది."

"డాక్టర్ ....నా రాధను కాపాడండి. ఎంత ఫీజు అయినా చెల్లిస్తాను."

"నెవ్వర్ మైండ్ మిస్టర్ రావ్. మేము మా శాయశక్తులా ప్రయత్నిస్తాము

"మేజర్ ఆపరేషన్ చేసి బిడ్డని తీయాలి. అందుకు మీ అంగీకారం కావాలి."

"ఆపరేషనా! డాక్టర్!" జీరగా పలికింది నా కంఠం.

"ఏమీ ఫరవాలేదు మిస్టర్ రావ్, దీనిమీద మీరు సంతకం చెయ్యండి."

సంతకం చేసి, నా భార్య ప్రాణాలు మీ చేతుల్లో ఉన్నాయని డాక్టర్ చేతులు పట్టుకున్నాడు.

గది బయట బెంచిమీద కూర్చున్నాను. కొంతసేపటికి చంటి పిల్లవాడి ఏడుపు వినిపించింది.

సిస్టర్ బయటికి వచ్చి అంది. "బాబు పుట్టాడు. తల్లి కులాసాగా ఉంది. ఇంకా స్పృహ రాలేదు.

నా గుండెలమీద బరువు ఒక్కసారి దిగి

పోయి నట్టయింది.

విమానం లోయలో పడిపోతుండగా నన్నెవరో అమాంతం ఎత్తుకుని లోయలో పడకుండా కాపాడినట్టుగా ఉంది నా మనస్సు.

కాని ఎంతోసేపు ఆఆనందం నిలువలేదు పుట్టినబిడ్డ కళ్ళారా చూస్తుండగానే ప్రాణం వదిలాడు

మంటలలో పడిపోతున్నవాణ్ణి ఆపి ఒడిసి పట్టుకొని, మళ్ళీ ఆ మంటల్లోకి విసిరి వేసినట్లుగా విలవిలలాడేను

డాక్టర్ నాభుజంమీద చెయ్యివేసి "బాధ పడకు రావ్. మాశాయశక్తులా ప్రయత్నించాము కాని లాభం లేకపోయింది. ఆపరేషన్ చెయ్యకపోతే ఈబిడ్డ గర్భములోనే మరణించేవాడు. అపుడు తల్లికి కూడా ప్రమాదం జరిగేది" అన్నాడు.

అపుడు నారాధ సంగతి గుర్తుకొచ్చి దగ్గరగా వెళ్ళాను వడగాలికి విలవిల లాడిపోయిన చిగురు టాకులాఉంది. ప్రసవవేదనను భరించి, బిడ్డకు జన్మయిచ్చి సొమ్మసిల్లి స్పృహ తప్పి పడిపోయిఉంది.

కాని ఆమొహంలో బిడ్డను కన్నందుకు గర్వం తొణికిసలాడుతున్నది.

"రాధా .. రాధా...." అని పిలిచేను కాని పలుకలేదు.

"డోన్ట్ డిస్టర్బ్ హర్" అంటూ డాక్టర్ నన్ను తన గదిలోకి తీసుకొని వెళ్ళాడు.

"బిడ్డ ఎక్కడండి? అని నారాధ నన్ను అడుగుతే నేనేమి సమాధానం చెప్పను డాక్టర్?"

"ప్లీజ్ బాధపడకండి ఇటువంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలి. మీరు ఒక చిన్న అబద్ధం ఆడాలి" అంటూ నావేపు చూసారు డాక్టర్.

"ఏమిటి" అన్నాను.

"బిడ్డ చనిపోయిన సంగతి మీ భార్యకు తెలియకూడదు."

"అదెలా సాధ్యం డాక్టర్. స్పృహరాగానే నాబిడ్డ ఏడి? ఎక్కడ ఉన్నాడు? ఎలా ఉన్నాడు?" అంటూ అడిగితే నేనేమి చెయ్యాలి డాక్టర్. ఆ అమాయకపు మొహం చూస్తూ ఎలా అబద్ధం చెప్పమంటారు?"

"నేను చెప్పినట్టు వినక పోతే మీరు మీ భార్యను కూడా పోగొట్టుకుంటారు ఇపుడు ఆవిడ చాలా బలహీనముగా ఉంది. బిడ్డ పోయాడని తెలిస్తే ఆషాక్ తట్టుకోలేదు."— హెచ్చరించాడు. డాక్టర్.

"అవును డాక్టర్ అసలు దురదృష్టం అంతానాది బిడ్డతోపాటు నా భార్య కూడా చచ్చిపోవలసింది. లేకపోతే మీరే ఏదైనా విషం యిచ్చి చంపి వెయ్యాల్సింది స్పృహరాగానే నా బిడ్డ ఏడి అని అడుగుతుంది. నేను అబద్ధం చెప్పి ఆ అమాయక మూర్తిని నమ్మించి నేను ఆత్మవంచన చేసుకొని నా భార్యకు ద్రోహం చెయ్యాలి అందుకనే నాభార్యను కూడా...."

"ఆవేశ పడకండి రావ్, నేను చెప్పేది వినండి." సిస్టర్ అని డాక్టర్ పిలవగానే పొత్తిళ్ళలో ఒక పసిగుడ్డును తీసికొని వచ్చింది.

"ఎవరు డాక్టర్ ఈబిడ్డ? తల్లిదండ్రులు ఎంత పుణ్యం చేసికొన్నారో."

"లేదు రావ్, ఈబిడ్డే దురదృష్ట వంతుడు. నిన్న ఒక అనాథస్త్రీ ఈబిడ్డని ప్రసవించి హాస్పటల్ నుండి పారిపోయింది. "ఈబిడ్డని పెంచిన వారికి నాకృతజ్ఞతలు" అని చీటి వ్రాసి వెళ్ళిపోయింది. చూడండి రావ్: ఈ అనాథ బిడ్డను మీరు స్వీకరించండి. వీడికి మీరే తల్లిదండ్రిగా ఉండండి."

డాక్టర్ అంటూ ఒక్కసారి పిచ్చిగా అరిచాను.

"నిదానంగా ఆలోచించండి! మీ భార్యకు

ఆపరేషన్ చెయ్యడంవల్ల ఇదే ఆఖరి కాన్పు. మీరు ఇకముందు తండ్రికాలేరు"

ఆ మాట వినగానే ఎర్రగా కాల్చిన ఇనుప కడ్డీలు పెట్టి కళ్ళల్లో పొడిచినట్లయింది. నాలో ఏదో తెలియరాని నిస్సహాయత, నిర్లిప్తత బయట పడ్డాయి. దేవుని మీద కక్షతో నా నోటికి వచ్చినట్లు మాట్లాడాను. తర్వాత నా నోటి నుండి మాటలు కరువైనట్లు, మూగవోయి నట్లుండి పోయాను. అలా ఎంత సేపు ఉన్నానో తెలియను.

నా భుజం మీద డాక్టర్ చెయ్యి వెయ్యడంతో ఈ లోకంలోకి వచ్చి లోతైన నూతి లోంచి మాట్లాడు తున్నట్లు "డాక్టర్" అన్నాను

"మీరు ఇంత బాధపడితే ఆవిడ ఇంకెంత బాధ పడుతుందో ఆలోచించారా? నవమాసాలు మోసి కన్న బిడ్డను చూడడానికి నోచుకోకపోతే ఎంత బాధ, ఎంత రంపపు కోత? మీరే ఆలోచించండి. ఒక్క మాటలో చెప్పాలంటే, బిడ్డ చనిపోయాడని తెలిస్ట్తే ఆమె బ్రతుకక పోవచ్చు."

"అయితే నన్నేమి చేయమంటారు డాక్టర్"

"ఈ బిడ్డను మీ బిడ్డగా అంగీకరించండి. ఇది మీ మంచికే"

"సరే డాక్టర్ ఈ బిడ్డను మేమే తల్లి దండ్రులమై, నా బిడ్డ స్థానంలో ఈ బిడ్డని చూచుకుంటూ తల్లి దండ్రులు లేని కొరతను తీరుస్తాము"

"వెరీగుడ్ మిస్టర్ రావ్."

సిస్టర్ స్పృహ వచ్చిందని చెప్పగానే డాక్టర్, నేను వెళ్ళాము. కళ్ళు తెరిచి నావేపు చూచి చిరునవ్వు నవ్వింది. కాని ఆ నవ్వులో జీవం లేదు, నీరసంతో కూడిన నవ్వు.

"పాపా, బాబా? అంటూ ప్రశ్నించింది.

"బాబుని తీసుకురా" అని సైగ చేశాడు డాక్టర్.

సిస్టర్ బాబుని రాధ పక్కలో పడుకో పెట్టింది.

ఆ బిడ్డని చూడగానే రాధకి మాతృత్వం పెల్లుబికింది. గాఢంగా గుండెలకు హత్తుకొని ముద్దాడింది. నా వేపు చూసి అంతా మీ పోలికే అంది.

నేను నా రాధ కళ్ళల్లోకి చూసేను. ఆ కళ్ళు కాంతితో ప్రకాశిస్తున్నవి.

ఇక భయం లేదు అనుకొని డాక్టర్ వైపు చూసేను. ఆయన చిరునవ్వుతో నన్ను అభినందించారు.

## నా పేరు

—జి. వాగేశ్వరరావు

మండే రొమ్ములపై యెండిన
పెదవులు దేవులాడగా
చేయిచాపిందో మాతృమూర్తి
నల్ల కారులోంచి
వచ్చిపడిందో పది పైసలు
పది తలలు పది హృదయాలు
ఒక్కసారిగా ముందుకొచ్చాయి
అమ్మా నీపేరేమిటి? ఎవరిదో ప్రశ్న
నా పేరా
"సోషలిజం!"